క్లుప్తంగా

వైభవంగా సత్తెమ్మతల్లి జాతర



మల్లేపల్లిలో కోలాటమాడుతున్న చిన్నారులు

గండేపల్లి: మల్లేపల్లి నీలకుండీల తోటలో ఉన్న గ్రామదేవత సత్తెమ్మ తల్లి జాతర మహోత్సవాన్ని ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో బుధవారం రాత్రి ఎంతో వైభవంగా జరిపారు. బాణసంచా కాల్పులతో డప్పు వాయిద్యాల నడుమ గరగ నృత్యాలతో అమ్మవారికి ఊరేగింపు నిర్వహించారు. ఆలయ ప్రాగణంలో చిన్నారుల కోలాట ప్రదర్శన చూపరులను ఆకట్టుకుంది. ఈ జాతర మహోత్సవానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు తరలి వచ్చి అమ్మవారికి ముడుపులు, మొక్కులు చెల్లించుకున్నారు. జాజిమొగ్గల సూర్యనారాయణ, సత్యనారాయణ, కంచర్ల వెంకటేశులు, వల్లభశెట్టి సత్తిబాబు, గ్రామస్తుల ఆధ్వర్యంలో జాతర ఏర్పాట్లు నిర్వహించినట్టు తెలియజేశారు.

నేవీ ఉద్యోగికి తప్పిన ప్రమాదం



మల్లేపల్లి శివారు రోడ్డు పక్కనే ప్రమాదానికి గురైన కారు

గండేపల్లి: నేవీ ఉద్యోగికి ప్రమాదం త్రుటిలో తప్పిన ఘటన ఇది. స్థానికులు, ప్రయాణికుల వివరాల మేరకు... ఢిల్లీ, వెస్ట్ బెంగాల్‌కు చెందిన ముగ్గురు వ్యక్తులు విశాఖ నేవీలో ఉద్యోగం చేస్తున్నారు. వీరు ముగ్గురు వేర్వేరు కారుల్లో విశాఖ నుంచి విజయవాడ వెళుతుండగా మండలంలోని మల్లేపల్లి శివారు జీడి పిక్కల ఫ్యాక్టరీ ఎదురుగా వచ్చే సరికి ముందు వెళుతున్న లారీ షడన్‌గా బ్రేక్ వేయడంతో ఒక కారు ప్రమాదానికి గురై రోడ్డుకు మధ్యలో ఉన్న డివైడర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు ముందుభాగం దెబ్బతినగా కారు నడుపుతున్న వ్యక్తికి ఎటువంటి గాయం కాలేదన్నారు. సంఘటన స్థలం వద్దకు చేరుకున్న రోడ్డు సేఫ్టీ సిబ్బంది గిరి, స్థానికుల సహాయంతో కారును పక్కకు తీయించారు.

విద్యుత్ స్తంభాల ఏర్పాటుకు 'కంబాల' చేయూత



కాలనీ వాసులకు నగదు అందజేస్తున్న కంబాల శ్రీనివాసరావు

గోకవరం: రంపయర్రంపాలెం గ్రామంలో విద్యుత్ స్తంభాల ఏర్పాటుకు విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు, బీజేపీ నాయకుడు కంబాల శ్రీనివాసరావు రూ.లక్ష సహాయం అందజేశారు. స్థానిక గంగాభవానీ నగర్‌లో విద్యుత్ సదుపాయం కోసం విద్యుత్ స్తంభాలు ఏర్పాటుకు సహకారం అందించాలని స్థానికులు శ్రీనివాసరావుని కోరగా ఆయన ఈ మేరకు ఆర్థిక సహాయం చేశారు. ఈ మొత్తాన్ని గురువారం ఆయన కాలనీవాసులకు అందజేశారు.

విలేకరులకు అండగా ఏపీయూడబ్ల్యూజే

గండేపల్లి: పాత్రికేయ వృత్తిలో ఉన్న వారికి ఏపీయూడబ్ల్యూజే (ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్) ఎల్లప్పుడు అండగా నిలుస్తుందని సభ్యులు తెలియజేశారు. మల్లేపల్లికి చెందిన నరవ వీరన్న ఓ పత్రికలో విలేకరిగా పనిచేస్తున్నాడు. ఇటీవల అతను తీవ్ర అనారోగ్యానికి గురై చికిత్స పొందుతూ ఇంటి వద్దే విశ్రాంతి తీసుకుంటున్నాడు. విషయం తెలుసుకున్న ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర నాయకులు, ఉమ్మడి జిల్లాల మాజీ అధ్యక్షుడు కె.స్వాతి ప్రసాద్ జగ్గంపేట నియోజకవర్గ సభ్యులను అప్రమత్తం చేసి బాధితుని ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని అండగా ఉండి ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. గండేపల్లి, జగ్గంపేట, గోకవరం మండలాలకు చెందిన సభ్యులు బాధితుడిని పరామర్శించి నిత్యావసర వస్తువులతో పాటు ఆర్థిక సహాయం అందజేశారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



108లో మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

ప్రత్తిపాడు: మూర్ఛ వ్యాధికి గురై ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి ఉదంతమిది. గురువారం రాత్రి శంఖవరం మండలం కత్తిపూడి జాతీయ రహదారి సమీపాన పోలవరం కాలువ వద్ద గుర్తు తెలియని వ్యక్తి ఫిట్స్ రావడంతో కిందపడి గిలగిలా కొట్టుకుంటున్నాడు. స్థానికులు గమనించి, 108కు సమాచారం అందించారు. సదరు వ్యక్తిని 108లో ప్రత్తిపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడు. మృత దేహాన్ని శవపరీక్ష కోసం స్థానిక సీహెచ్‌సీకి తరలించారు. మృతునికి 25–35 సంవత్సరాల వయస్సు ఉంటుందని, ఆచూకీ తెలిసిన వారు ప్రత్తిపాడు పోలీసులకు సమాచారం అందించాలని స్థానిక పోలీసులు కోరుతున్నారు.

ఉద్యానవనానికి ఊతం

- ఉద్యాన పంటల సాగు విస్తరణకు ఉపాధి నిధులు
- మూడేళ్లలో రూ.65వేల నుంచి రూ.2 లక్షల వరకు రాయితీ

తుని రూరల్: దేశీయ అవసరాలకు అనువుగా పండ్ల ఉత్పత్తులు పెంచేందుకు ఉద్యాన పంటల సాగు విస్తరణకు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ఊతం ఇస్తోంది. కొత్తగా మొక్క పండ్ల తోటలు సాగు చేపట్టే సన్నా చిన్నకారు రైతులకు మూడేళ్లపాటు రాయితీలు అందించనున్నారు. పట్టాదారు పాస్ పుస్తకాలు కలిగి ఉన్న సాగుదారులకు రాయితీలు అందిస్తూనే వ్యవసాయ కూలీలకు పని దినాలు కల్పిస్తోంది. పంటల వారీగా రాయితీలు, ఉపాధి పని దినాలు కల్పన జరుగుతుందని ఎంజీఎన్ఆర్ఈజీఎస్ అధికారులు తెలిపారు. ప్రధానంగా మామిడి, జీడిమామిడి, నిమ్మ, నారింజ, కొబ్బరి, చింత, సపోట, సీతాఫలం పండ్ల తోటలకు ఈ రాయితీలు వర్తింపజేశారు. ఒక ఎకరాలో ఏ తోటకు ఎన్నెన్ని మొక్కలు నాటితే ఎన్ని పని దినాలు కల్పిస్తారో స్పష్టంగా పేర్కొన్నారు. ఒక్కొక్క పంటకు ఒక్కొక్క విధంగా రాయితీలు ప్రకటించారు. కనిష్ఠంగా ఆయా తోటలను బట్టి రూ.65,763 నుంచి రూ.2,02,659 వరకు రైతులు రాయితీ పొందవచ్చు. ఆయా శాఖల ద్వారా ఆయిల్‌పామ్, మల్బరీ, అరటి, కోకో, బొప్పాయి తదితర ఉద్యాన పంటలకు వేర్వేరుగా రాయితీలు, ప్రోత్సాహకాలు అందించనున్నారు.

250 ఎకరాలు లక్ష్యం

తుని నియోజకవర్గం మూడు మండలాల్లో 2025–26 సీజన్‌లో 250 ఎకరాల్లో పండ్ల తోటల విస్తరణ జరగాలని ఎంజీఎన్ఆర్ఈజీఎస్ ఉన్నత అధికారులు లక్ష్యంగా నిర్దేశించారు. దీంతో తుని మండలం రెండొందల ఎకరాలు, కోటనందూరు మండలంలో వంద ఎకరాలు, తొండంగి మండలంలో యాభై ఎకరాల్లో పండ్ల తోటలకు రాయితీలు లభించనున్నాయి. మొక్కలు నాటుకునేందుకు సమయం సమీపిస్తుండడంతో ఆసక్తి గల రైతులు ఆయా గ్రామాల్లో ఉద్యాన సహాయకులు, ఎన్ఆర్ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్ల ద్వారా దరఖాస్తులు చేసుకోవాలి.



ఎన్.సూరవరంలో సాగవుతున్న మామిడి, జీడిమామిడి, కొబ్బరి మొక్క తోటలు

పండ్ల తోటలకు మూడేళ్లలో ఉపాధి పథకం రాయితీలు, కూలీలకు పని దినాలు

పండ్ల తోటలు	ఎకరాకు మొక్కలు	మొదటి సంవత్సరం	రెండో సంవత్సరం	మూడో సంవత్సరం	మూడేళ్లలో మొత్తం	పని దినాలు కల్పన
మామిడి	70	రూ.47584	రూ.28550	రూ.30033	రూ.106170	216 రోజులు
నిమ్మ	110	రూ.54321	రూ.43603	రూ.45086	రూ.143011	275 రోజులు
జీడిమామిడి	70	రూ.36734	రూ.28553	రూ.30037	రూ.95324	179 రోజులు
నారింజ	100	రూ.49986	రూ.39840	రూ.41324	రూ.131150	251 రోజులు
కొబ్బరి	60	రూ.41639	రూ.24279	రూ.26274	రూ.92704	187 రోజులు
చింత	40	రూ.29747	రూ.17266	రూ.18750	రూ.65763	129 రోజులు
సీతాఫలం	240	రూ.85575	రూ.57800	రూ.59248	రూ.202659	385 రోజులు
సపోట	60	రూ.41639	రూ.24791	రూ.26274	రూ.92704	187 రోజులు

రైతులకు, కూలీలకు ప్రయోజనం



ఉద్యాన పంటలకు ఉపాధి పథకం అనుసంధానంతో రైతులకు, వ్యవసాయ కూలీలకు ప్రయోజనం కలుగుతుంది. రైతులకు రాయితీలు లభిస్తుండగా కూలీలకు పని దినాలు కల్పిస్తున్నాం. మొక్కలు, ఎరువులు కొనుగోలు, గుంతలు తవ్వకం, నీటి తడుల నిర్వహణకు రాయితీ నిధులు జమ చేస్తాం. జూన్ నుంచి ఆగస్టు వరకు మొక్కలు నాటుకునేందుకు అనువైన వాతావరణం ఉంటుంది. అప్పటిలోగా సన్నా చిన్నకారు రైతులు దరఖాస్తులు చేసుకోవాలి. పట్టాదారు పాస్ పుస్తకం, రెండు పాస్ ఫొటోలు, ఫోన్ నంబరు లింకు అయిన బ్యాంకు ఖాతా నకలతో ఉద్యాన, ఎన్ఆర్ఈజీఎస్ అధికారుల వద్ద దరఖాస్తు చేసుకోవాలి.

– పసుపులేటి నారాయణరావు, ఏపీఓ, తుని

అభివృద్ధి సంక్షేమాలపై ప్రత్యేక అధికారి సమీక్ష



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి శ్రీధర్

తుని రూరల్: అభివృద్ధి, సంక్షేమాలపై రాష్ట్రస్థాయి నుంచి గ్రామస్థాయి వరకు యాక్షన్ ప్లాన్‌లు అమలు చేయాలని, ఇందులో ఎవరికి మినహాయింపులేదని నియోజకవర్గ ప్రత్యేక అధికారి, జీజీహెచ్ ఏఓ ఎస్.శ్రీధర్ అన్నారు. గురువారం తుని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ ఎస్.సాయి నవీన్ అధ్యక్షతన నియోజకవర్గ సమీక్షా సమావేశం జరిగింది. విద్య, వైద్యం, సాంఘిక సంక్షేమం, తాగునీరు, పారిశుధ్య నిర్వహణ, ఐసీడీఎస్, ఎన్ఆర్ఈజీఎస్, స్వయం సహాయక సంఘాలు, ఫారెస్టు, మున్సిపల్, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై శాఖల వారీగా సమీక్షించారు. తుని, కోటనందూరు, తొండంగి, మున్సిపల్ అధికారులు హాజరయ్యారు. ఈనెల మూడో వారం నిర్వహించనున్న స్వచ్ఛాంధ్ర ప్రదేశ్ కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలన్నారు. జిల్లా కలెక్టర్, జిల్లా ప్రత్యేక అధికారి తుని నియోజకవర్గంలో పర్యటిస్తారన్నారు. కమిషనర్ వెంకట్రావు, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ స్వప్న, తహసీల్దార్ ప్రసాద్, మూడు మండలాల ఎంపీడీఓలు, తహసీల్దార్లు, అధికారులు పాల్గొన్నారు.

తూతూ మంత్రంగా మండల సర్వసభ్య సమావేశం



కార్యక్రమంలో అభివృద్ధి పథకాల గురించి వివరిస్తున్న పంచాయతీ రాజ్ జేఈ మురళి

రౌతులపూడి: ప్రజా సమస్యలను చర్చించేందుకు ఎంపీపీ గంటిమళ్ల రాజ్యలక్ష్మి అధ్యక్షతన గురువారం జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం తూతూ మంత్రంగా సాగింది. ఎంపీడీఓ బి.శివరామకృష్ణయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారుల వారి శాఖల చేపట్టిన వివిధ పనులను మాత్రమే వివరించి మమ అనిపించారు. ఏఈఓ సీహెచ్ గోపీనాథ్ ఈ ఏడాది ప్రభుత్వం చేపట్టే అన్నదాత సుఖీభవ పథకం, ఇతర రాయితీలు గురించి వివరించారు. ఈ ఖరీఫ్‌కు సంబంధించి 50 టన్నుల విత్తనాలను సిద్ధం చేస్తున్నట్టు వివరించారు. ఉద్యానవన శాఖ అధికారి అరుణ్‌కుమార్ ఉద్యానవన పంటలకు సంబంధించి ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు గురించి వివరించారు. ఎంఈఓ–2 గాడి కొండబాబు వచ్చే విద్యాసంవత్సరానికి గాను అన్ని ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించి ఉపాధ్యాయులు గ్రామాల్లో పర్యటించి విద్యార్థుల నమోదు చేశారన్నారు. ఈ మేరకు రౌతులపూడి ఎంపీటీసీ–2 ఉపాధ్యాయులు గ్రామాల్లో పర్యటించి విద్యార్థులను నమోదు చేసే ముందు ప్రభుత్వ పాఠశాలల్లో పని చేసే ఉపాధ్యాయులు ఎంతమంది తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చదివిస్తున్నారో తెలపాలని ప్రశ్నించారు. అదేవిధంగా ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ గౌతమ్ మాట్లాడతూ ప్రస్తుతం వేసవిలో గ్రామాల్లో ఎక్కడ తాగునీటి ఎద్దడిలేకుండా అవసరమైన చర్యలు చేపట్టామన్నారు. పంచాయతీరాజ్ జేఈ మురళి ప్రస్తుత గ్రామాల్లో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనుల గురించి వివరించారు. అదేవిధంగా ఉపాధి, వెలుగు, ఐసీడీఎస్, ఆరోగ్యం తదితర శాఖల అధికారులు వారి శాఖల పని తీరు గురించి సమావేశంలో వివరించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు ఎస్.సాయి, వాసిరెడ్డి మంగాలక్ష్మి, ఎంపీటీసీలు, సర్పంచులు అధికారులు పాల్గొన్నారు.

వెంకాయమ్మ చిత్రపటానికి నివాళి



రాజవరంలో వెంకాయమ్మ చిత్రపటం వద్ద శ్రద్ధాంజలి ఘటిస్తున్న ముద్రగడ గిరిబాబు

రౌతులపూడి: రాజవరంలో సోమరౌతు తిరుమల వెంకన్నదొర మాతృమూర్తి వెంకాయమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. వారి స్వగృహంలో సోమరౌతు వెంకయమ్మ మృతికి గురువారం శ్రద్ధాంజలి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రత్తిపాడు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు హాజరై ఆమె చిత్రపటం వద్ద నివాళులర్పించారు. సోమరౌతు కుటుంబంతో తన తండ్రి వైఎస్సార్ సీపీ పొలిటికల్ అడ్వయిజర్, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభంతో ఎనలేని అనుబంధం ఉంది. అంతకు ముందు రాజవరంలో ఇటీవల శస్త్ర చికిత్స చేయించుకున్న పార్టీ సీనియర్ నాయకుడు పంచాడ అప్పలనాయుడును పరామర్శించి ఆయన ఆరోగ్యంపై చర్చించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు వాసిరెడ్డి జమీలు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర బీసీ విభాగం అధికార ప్రతినిధి గొల్లు వెంకటరమణ, నియోజకవర్గ బీసీ విభాగం అధ్యక్షుడు సర్నం శ్రీను, పార్టీ నేతలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రెడ్నం గోవిందు మృతి

ప్రత్తిపాడు: గ్రామానికి చెందిన రెడ్నం గోవిందు(66) గురువారం ఆకస్మికంగా మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. సాయంత్రం గోవిందు మృతదేహాన్ని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు సందర్శించి, నివాళులర్పించారు. ఆయన వెంట మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ శేరు కృష్ణ తదితరులున్నారు.

సమ్మెను విజయవంతం చేయండి



గోకవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ నాయకులు

గోకవరం: ఈనెల 20న చేపట్టే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ జిల్లా కార్యదర్శి ఏగుపాటి అర్జునరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు సంఘ నాయకులతో గురువారం గోకవరంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ ఆధ్వర్యంలో కేంద్రంలో కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తుందన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా చేపట్టిన సార్వత్రిక సమ్మెను కార్మికులు, ప్రభుత్వ, ప్రైవేటు రంగాల ఉద్యోగులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు జగ్గంపూడి రాజా, దిమ్మితి అప్పారావు, నాగులపల్లి అచ్చారావు తదితరులు పాల్గొన్నారు.

యువత ఓటర్లుగా నమోదు కావాలి

నియోజకవర్గ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి శ్రీనివాసరావు



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

ప్రత్తిపాడు: నియోజకవర్గంలోని 18–19 ఏళ్ల యువత తప్పనిసరిగా ఓటర్లుగా నమోదు కావాలని ప్రత్తిపాడు నియోజకవర్గ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, జిల్లా బీసీ కార్పొరేషన్ కార్య నిర్వాహక సంచాలకుడు ఎ.శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి, ఓటరు నమోదు చేపట్టాలని ఎన్నికల సిబ్బందిని ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల సూపర్‌వైజర్లతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్తిపాడులోని పోలింగ్ కేంద్రాల సంఖ్య 92 నుంచి 95 వరకూ ఉన్న ఐదు పోలింగ్ స్టేషన్ల భవనాలు శిథిల స్థితిలో ఉన్నందున స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భవనాల్లో ఏర్పాటు చేసేందుకు పరిశీలన చేస్తామన్నారు. స్త్రీ, పురుష ఓటర్ల సంఖ్యలో వ్యత్యాసం కల పోలింగ్ కేంద్రాల పరిధిలో ఓటర్ల సంఖ్య పెంచాలని సిబ్బందిని ఆదేశించారు. పోలింగ్ కేంద్రం పరిధిలో జనాభా కంటే ఓటర్లు అధికంగా ఉంటే ఆ పోలింగ్ కేంద్రంలోని ఓటరు జాబితా సరి చూడాలన్నారు. సందేహాలుంటే నియోజకవర్గంలోని అసిస్టెంట్ ఎన్నికల అధికారులను సంప్రదించాలని నియోజకవర్గ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి ఎ.శ్రీనివాసరావు కోరారు. ఈ సమావేశంలో రౌతులపూడి, ఏలేశ్వరం తహసీల్దార్లు నరేష్, కుశరాజు, ప్రత్తిపాడు, శంఖవరం డిప్యూటీ తహసీల్దార్లు కె.పుణ్యవతి, కిరణ్‌కుమార్, వైఎస్సార్ సీపీ నాయకుడు శేరు కృష్ణ, బీజేపీ నాయకుడు శింగిలిదేవి సత్తిరాజు, పీసీసీ సభ్యుడు ధరణాలకోట శ్రీను, కొండపల్లి శ్రీను (టీడీపీ), ఎం.వీరబాబు (జనసేన)లతో పాటు ఎన్నికల సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

శుభం చిత్ర యూనిట్ సందడి



జగ్గంపేట శుభం చిత్ర యూనిట్ సభ్యులకు స్వాగతం పలుకుతున్న వీరాంజనేయ ఫిలిమ్స్ అధినేతలు

జగ్గంపేట: స్థానిక నాగేశ్వర థియేటర్‌కు శుభం చిత్ర యూనిట్ గురువారం విచ్చేసి ప్రేక్షకుల మధ్య సందడి చేశారు. శ్రీ వీరాంజనేయ ఫిలిమ్స్ సభ్యులు కొత్త వీరభద్రరావు, బూర్ల సాయికుమార్ శుభం చిత్ర యూనిట్ సభ్యులకు ఘన స్వాగతం పలికారు. ప్రముఖ సినీతార సమంత నిర్మించిన చిత్రం కావడంతో ఆమె సక్సెస్ టూర్‌లో భాగంగా జగ్గంపేట వస్తారన్న ప్రచారం జరగడంతో పెద్ద ఎత్తున అభిమానులు థియేటర్ వద్దకు చేరుకున్నారు. ఆమె రాకపోయినా ఆ చిత్రం డైరెక్టర్ ప్రవీణ్ కాండ్రేగుల, నటులు హర్షిత్ రెడ్డి, శ్రేయ, శ్రీనివాస్ గౌరెడ్డి, శ్రావణి, చరణ్, వంశీధర్, షాలినీ తదితరులు విచ్చేసి ప్రేక్షకులతో ముచ్చటించారు. చిత్రాన్ని విజయవంతం చేసినందుకు ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలిపారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



కోటనందూరులో వాహనదారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్సై రామకృష్ణ

కోటనందూరు: రహదారి నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఎస్సై టీ రామకృష్ణ హెచ్చరించారు. నంబర్ ప్లేట్లు లేని, హెల్మెట్ లేకుండా ప్రయాణించే ద్విచక్ర వాహనదారులను స్థానిక పోలీసుస్టేషన్ వద్ద నిలిపి కౌన్సెలింగ్ ఇచ్చారు. సరైన నంబర్‌ప్లేట్ లేకుండా ప్రయాణిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. వాహనదారుడు విధిగా లైసెన్స్, సీ బుక్ కలిగి ఉండాలన్నారు. ప్రాణాలను కాపాడే హెల్మెట్‌ను అందరూ విధిగా ధరించాలని సూచించారు.

ఆర్థర్ కాటన్‌కు నివాళి



కాటన్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఆదిత్య సిబ్బంది

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో గురువారం సర్ ఆర్థర్ కాటన్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి డిప్యూటీ ప్రో ఛాన్సలర్ ఎం.శ్రీనివాసరెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీడు భూములను పంట భూములుగా మార్చిన ఘనత ఆయనకే దక్కుతుందని అన్నారు. ధవళేశ్వరం ఆనకట్టను నిర్మించి ఉభయ గోదావరి జిల్లాలను సస్యశ్యామలం చేసినట్టు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డీన్ వి.సత్యనారాయణ, గ్రంథాలయ విభాగాధిపతి కె అశోక్ కుమార్, ఎండీ కలీషా, రాంబాబు, ఏ సుభాకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వర్షంతో నష్టం



జి.కొత్తపల్లిలో నేలకొరిగిన అరటి తోట

శంఖవరం: మండలంలో గురువారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో ప్రజలు కొంత మేర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కొన్ని చోట్ల చెట్లు కొమ్మలు విరగడంతో పాటు అరటి, మామిడి తోటల రైతులకు నష్టం వాటిల్లింది. చేతికి అంది వచ్చిన మామిడి కాయలు గాలికి రాలిపోవడంతో రైతులకు నష్టం వాటిల్లింది. జి.కొత్తపల్లి, శంఖవరం, ఎస్.జగ్గంపేట, గౌరంపేట గ్రామాల్లో ఈదురుగాలులకు అరటి తోటలు నేలకొరిగినట్టు రైతులు వాపోయారు. కొన్ని చోట్ల విద్యుత్ అంతరాయం కలగడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

చల్లబడిన వాతావరణం

తొండంగి: కొద్ది రోజులుగా అధిక ఉష్ణోగ్రతలు, ఉక్కపోతతో తీవ్ర ఇబ్బందులు పడిన ప్రజలకు గురువారం సాయంత్రం కురిసిన వర్షంతో వాతావరణం చల్లబడింది. దాదాపు పది రోజుల నుంచి ఉదయం నుంచే ఉష్ణోగ్రతలు అధికంగా ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గురువారం సాయంత్రం ఆకాశం దట్టమైన మబ్బులతో మేఘావృతమై కుండపోత వర్షం కురిసింది. వాతావరణం పూర్తిగా చల్లబడడంతో ఉక్కపోతతో ఇబ్బంది పడిన ప్రజలు చల్లదనానికి సేదతీరారు.

విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సై రామకృష్ణ

కోటనందూరు: విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఎస్సై తలారి రామకృష్ణ పిలుపునిచ్చారు. ఎస్పీ బిందుమాధవ్ ఆదేశాల మేరకు స్థానిక ఏవీఎం కోచింగ్ సెంటర్లో విద్యార్థులకు సైబర్ నేరాలు, మత్తుపదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా సైబర్‌నేరాలు పెరిగిపోతున్నాయన్నారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, తెలియని నంబర్ల నుంచి వచ్చే సందేశాలకు సమాధానాలు ఇవ్వకూడదని సూచించారు. విద్యార్థులు గంజాయి, స్మగ్లింగ్, మద్యం, మత్తు పదార్థాల జోలికి పోకూడదన్నారు. వ్యసనాలతో జీవితం నాశనం అవతుందన్నారు. ఏవీఎం అధినేత అల్లు విష్ణుమూర్తి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


క్రీడలతో మానసిక ఉల్లాసం



తునిలో క్రికెట్ టోర్నీ విజేతలకు ట్రోఫీని అందజేస్తున్న తోట సుధీర్, బోడపాటి శివదత్

తుని: క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదం చేస్తాయని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కార్పొరేషన్ చైర్మన్ తోట సుధీర్ అన్నారు. గురువారం స్థానిక రాజా కళాశాల మైదానంలో మోగా పవర్ 20–20 క్రికెట్ టోర్నీ బహుమతి ప్రదాన కార్యక్రమం రాష్ట్ర సివిల్ సప్లై కార్పొరేషన్ డైరెక్టర్ బోడపాటి శివదత్ అధ్యక్షతన నిర్వహించారు. ఉత్కంఠ భరితంగా సాగిన ఫైనల్ మ్యాచ్‌లో జేకే స్వేగర్స్ రాజమండ్రి జట్టు విశాఖపట్నం జట్టు క్యాబ్స్‌పై విజయం సాధించి టోర్నీ విజేతగా నిలిచింది. ప్రథమ స్థానం సాధించిన జేకే స్వేగర్స్ రాజమండ్రి జట్టు, ద్వితీయ స్థానంలో నిలిచిన విశాఖపట్నంకు చెందిన క్యాబ్స్ జట్టుకు ట్రోఫీలను తోట సుధీర్ అందజేశారు. జనసేన పార్టీ సీనియర్ నాయకుడు తోట నగేష్, ఫెస్టీ ఫుడ్ ఇన్ అధినేత రమేష్‌నాయుడు, సీనియర్ జర్నలిస్ట్ బోడపాటి సతీష్, పట్టణ ప్రముఖులు, క్రీడాభిమానులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

పశువులాసుపత్రి శిథిలం



శ్లాబు నుంచి పెచ్చులూడి ప్రమాదకరంగా ఉన్న ఆసుపత్రి



పశువుల ఆసుపత్రి

కిర్లంపూడి: పాలెం గ్రామంలోని ప్రభుత్వ పశువులాసుపత్రి శిథిలావస్థకు చేరుకుంది. ఆసుపత్రి నిర్మించి ఏళ్లు గడుస్తున్నా మరమ్మతులకు నోచుకోకపోవడంతో భవనం శ్లాబ్, గోడ బీటలు వారింది. వర్షాకాలంలో శ్లాబ్ నుంచి వర్షం నీరు లీకవ్వడంతో ఆసుపత్రిలోని నిలువ చేసే విలువైన పశువుల మందులు తడిసిపోతున్నాయి. శ్లాబు నుంచి పెచ్చులూడడంతో ఏ ప్రమాదం జరుగుతుందోనని పాడి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి నూతనం భవనం ఏర్పాటు లేదా కనీసం మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

19న శ్యాంబాబు సంతాప సభ

తుని: ఈ నెల 19న కాకినాడలో జరిగే కొండేపూడి శ్యాంబాబు సంతాప సభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ ఉభయగోదావరి జిల్లాల అధ్యక్షుడు ముప్పిడి శ్యాంకుమార్ అన్నారు. స్థానిక కొండవారిపేటలో ఎమ్మార్పీఎస్ ప్రతినిధులతో ఆ మేరకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్యాంబాబు సంతాప సభకు మందకృష్ణ మాదిగ హాజరవుతారన్నారు. తుని పట్టణం, తుని, కోటనందూరు, తొండంగి మండలాల ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ, ఎంఈఎఫ్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కాకడ నూకరాజు, జిల్లా అధ్యక్షుడు అనంతపు రాజు పాల్గొన్నారు.